సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024




అమలాపురం.. అభివృద్ధి సుమం
కోనసీమ జిల్లా కేంద్రంగా ఆవిర్భవించిన అమలాపురం పట్టణం గడచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రగతి పట్టాలపై పరుగులు పెట్టింది.



పరుగో పరుగు..
సామర్లకోట మండలం ఉండూరు ఎస్ఎఫ్‌సీ ఎల్ రోడ్డులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఆదివారం ఉత్సాహంగా, ఉత్కంఠభరితంగా జరిగాయి.

8 లో

డెల్టాలకు 9,100 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 2,000, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.60 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

వక్రతుండాయా.. వరప్రదాయ


అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి సన్నిధిలో లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

అయినవిల్లి: భజే గణనాథా అంటూ ఆ స్వామిని భక్తజనం కొలిచింది. ఆదివారం అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం కిక్కిరిసింది. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో మేలుకొలుపు సేవ నిర్వహించారు. తర్వాత స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 47 మంది, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 416 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 27 మంది పాల్గొన్నారు. 27 మంది నూతన వాహన పూజ చేయించుకున్నారు. 18 మంది చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యా లు జరిగాయి. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,41,890 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ఎం. సత్యనారాయణరాజు, చైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు.

పార్టీ శ్రేణులకు మంత్రి విశ్వరూప్ కృతజ్ఞతలు

అమలాపురం టౌన్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వేలాదిగా తరలివచ్చి దెందులూరులో జరిగిన సిద్ధం సభను విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేసిన సిద్ధం సభలో పాల్గొన్న ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు నేటి నుంచి ప్రాక్టికల్స్


రాయవరం: ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఒకేషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్ ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఒకేషనల్ ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి బ్యాచ్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో బ్యాచ్‌గా ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. 2,894 మంది ఇంటర్ ఫస్టియర్, 2,040 మంది ద్వితీయ ఏడాది విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ పరీక్షలకు ఆయా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియెట్ బోర్డు పరీక్షల ప్రత్యేకాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. అవకతవకలు జరగకుండా స్క్వాడ్స్‌ను నియమించినట్లు వివరించారు.

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్: జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన– జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలాపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బడుగులే కరివేపాకులు

- టీడీపీ, జనసేనల్లో దుస్థితి
- కొలిక్కిరాని సీట్ల పంచాయితీ
- బీసీ, ఎస్సీ నేతలతో ఆటలు
- సొమ్ముల పేరుతో కొందరికి.. బలం లేదని మరికొందరికి మొండిచేయి



సాక్షి, అమలాపురం: బడుగు బలహీన వర్గాలు, దళితులకు అండగా నిలిచేది తమ పార్టీయేనని, వారికి రాజ్యాధికారం కల్పించింది తామేనని ప్రతిపక్ష టీడీపీ.. వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని జనసేన పార్టీలు గొప్పలు చెప్పుకుంటూనే.. ఆ వర్గానికి చెందిన నాయకులను కూరలో కరివేపాకుల్లా వాడుకుని వదిలేస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా ఆ రెండు పార్టీల్లో నెలకొన్న రాజకీయ పరిణామాలే ఇందుకు తాజా ఉదాహరణ. పొత్తులు, ఆర్థిక బలం పేరుతో ఆయా నియోజకవర్గాల్లో ఏళ్ల తరబడి పార్టీ జెండాలు మోస్తున్న వారిని, సీనియర్లను పక్కన పెట్టేందుకు రెండు పార్టీలూ సిద్ధమవుతున్నాయి. రెండు పార్టీల అధిష్టానాలూ తమను వాడుకుని వదిలేయడంపై ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలు మండిపడుతున్నారు.

టికెట్టు వస్తుందా.. రాదా..

జిల్లాలోని రాజోలు, పి.గన్నవరం, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాలు, అమలాపురం లోక్‌సభ స్థానం ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. మిగిలిన కొత్తపేట, ముమ్మిడివరం, మండపేట, రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గాలు జనరల్ కాగా, వీటిలో రామచంద్రపురం, ముమ్మిడివరం స్థానాల్లో బీసీల ప్రాబల్యం అధికంగా ఉంది. ఈ కారణంగా జిల్లాలో సీట్ల కేటాయింపులో ఎస్సీ, బీసీలకు తప్పనిసరిగా ప్రాధాన్యం కల్పించాల్సి ఉంది. అయితే, జిల్లాలో ఎస్సీలకు తప్పనిసరిగా కేటాయించాల్సిన స్థానాల్లోను, బీసీలకు ఇవ్వాలనుకుంటున్న చోట్ల టీడీపీ, జనసేన పార్టీలు గందరగోళం సృష్టిస్తున్నాయి. ఈ రెండు పార్టీల మధ్య ఇప్పటి వరకూ సీట్ల సర్దుబాటు జరగలేదు. కానీ, మొత్తం ఏడు సీట్ల నుంచీ పోటీ చేయాలని ఇరు పార్టీల నేతలూ ఆశతో ఉన్నారు.

పొత్తుల వల్ల తమ స్థానాలు కోల్పోతామనే భయం ఆ పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జిలను, ఆశావహులను ఒకవైపు వెంటాడుతోంది. మరోవైపు పొత్తుల్లో తమ పార్టీకి అవకాశం వచ్చినా టికెట్టు తమకు వస్తుందనే భరోసా వారికి లేకుండా పోయింది. అభ్యర్థి వ్యక్తిగత బలంకన్నా, ఆర్థిక బలమే గీటురాయిగా మారడంతో వీరికి టికెట్టు వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా దళిత, బీసీ నేతలకు సీటు వస్తుందనే భరోసా లేకుండా పోయింది. ఇదే సమయంలో మండపేట నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొత్తపేట, ముమ్మిడివరం నుంచి టీడీపీ నుంచి టికెట్లు ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) తామే అభ్యర్థులమంటూ ప్రచారం చేస్తూండటం గమనార్హం.

ష్.. టీడీపీలో భరోసా లేదు

- రాజోలు అసెంబ్లీ స్థానానికి గత ఎన్నికల్లో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గొల్లపల్లి సూర్యారావు పోటీ చేసి ఓటమి చెందారు. తిరిగి ఇక్కడి నుంచే పోటీ చేయాలని ఆయన కోరుకుంటున్నారు. అయితే, ఇక్కడ నుంచి జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించడంతో గొల్లపల్లి ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది స్పష్టత లేదు. ఆయన పి.గన్నవరం సీటు ఆశిస్తున్నా టీడీపీ అధిష్టానం నుంచి భరోసా లేదు.
- అమలాపురం నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తిరిగి పోటీ చేయాలని అనుకుంటున్నా మాజీ హోం మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వర్గం వ్యతిరేకిస్తోంది. దీనికితోడు సొమ్ములు లేవనే కారణంతో ఆనందరావును పక్కన పెట్టనున్నారు. అలాగే పార్లమెంటరీ ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్‌ను ఇక్కడి నుంచి పోటీలో పెట్టాలని భావిస్తున్నందున ఆనందరావుకు ఝలక్ తగలనుంది. అలాగే, ఇక్కడ నుంచి సీటు ఆశించి, ఐదేళ్లుగా పార్టీకి డబ్బులు ఖర్చు చేసిన పరమట శ్యామ్‌కుమార్, పోతుల సుభాష్‌చంద్రబోస్ వంటి వారిని కాదని, కొత్తగా పార్టీలోకి వస్తున్న కోటీశ్వరుల వైపు అధిష్టానం చూస్తోందని చెబుతున్నారు.
- గంటి హరీష్ మాధుర్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచీ పార్లమెంట్‌కు వెళ్లాలనే ఉద్దేశంతోనే ఉన్నారు. అయితే, ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోవడంతో ఆయనను తప్పించి, అమలాపురం లేదా పి.గన్నవరం నుంచి అసెంబ్లీ బరిలో నిలపాలని టీడీపీ పెద్దలు భావిస్తున్నారు. దీనిపై హరీష్ కినుక వహించినా ఫలితం లేకుండా పోయింది. ఆయన స్థానంలో కొత్తగా పార్టీలో చేరిన పాము సత్యశ్రీ లేదా పార్టీలో చేరనున్న ఒక పారిశ్రామికవేత్తను పార్లమెంట్‌కు పంపాలని టీడీపీ భావిస్తోంది.
- టీడీపీలో బీసీ సీనియర్ నేత, శాసనమండలి మాజీ డిప్యూటీ స్పీకర్ రెడ్డి సుబ్రహ్మణ్యం(ఆర్‌ఎస్)కు సైతం సీటు భరోసా లేదు. ప్రస్తుతం ఆయన రామచంద్రపురంలో పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ముమ్మిడివరంలో దాట్ల బుచ్చిబాబుకు ఇచ్చేందుకు రామచంద్రపురం సీటును జనసేనకు త్యాగం చేస్తున్నట్లు టీడీపీలో ప్రచారం జరుగుతోంది. ఒకవేళ టీడీపీకి ఇక్కడ సీటు కేటాయించినా కాపు సామాజికవర్గానికి చెందిన రాయపురెడ్డి సూరిబాబుకు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

జనసేనదీ అదే దారి

- జనసేనలో సైతం దళితులు, బీసీ నేతలు కరివేపాకుల్లా మారనున్నారు. అమలాపురం అసెంబ్లీ నుంచి సీటు ఆశిస్తున్న శెట్టిబత్తుల రాజబాబు, డీఎంఆర్ శేఖర్‌లలో ఒక్కరికి కూడా పార్టీ నుంచి స్పష్టమైన భరోసా లేదు. ఈ సీటు టీడీపీకి ఇస్తారని, బాలయోగి కుమారుడు గంటి హరీష్ మాధుర్‌ను బరిలో నిలుపుతారని ప్రచారం జరుగుతోంది. దీంతో గడచిన ఏడేళ్లుగా పార్టీలో తిరుగుతున్న రాజబాబు, శేఖర్‌లకు మొండిచేయి చూపినట్టే. గత ఎన్నికల్లో శేఖర్ ఎంపీగా పోటీ చేస్తే, రాజబాబు అసెంబ్లీకి పోటీ చేశారు. అయినప్పటికీ వీరికి ప్రాధాన్యం లేకుండా పోయింది.
- ఇక జనసేన పీఏసీ సభ్యుడు, గత ఎన్నికల్లో పార్టీ తొలి అభ్యర్థి, బీసీ సామాజికవర్గానికి చెందిన పితాని బాలకృష్ణ పరిస్థితి మరీ దారుణం. గత ఎన్నికల్లో ఆయన ముమ్మిడివరం నుంచి పోటీ చేశారు. ఈసారి ఆయనకు అక్కడ అవకాశం లేనట్టేనని టీడీపీతో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలే ప్రచారం చేస్తున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు ఈ సీటు ఇచ్చేందుకు వీలుగా బాలకృష్ణను రామచంద్రపురం వెళ్లాల్సిందిగా అటు టీడీపీ, ఇటు జనసేన నేతలు కోరుతున్నట్టు తెలిసింది. సొంత ప్రాంతం వదిలి వెళ్లేందుకు బాలకృష్ణకు ఇష్టం లేకున్నా మరో ప్రత్యామ్నాయం లేదు. అలాగని రామచంద్రపురం అయినా ఇస్తారనే భరోసా కూడా లేకుండా పోయింది.

భారతావనికి ఆదర్శం శ్రీరాముడు

- ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు
- అన్నదానం చిదంబర శాస్త్రికి సత్కారం


అన్నదానం చిదంబరశాస్త్రిని సత్కరిస్తున్న గరికపాటి నరసింహారావు, ప్రగతి భారతమ్ ట్రస్ట్ సభ్యులు

రావులపాలెం: అయోధ్య రామ మందిర నిర్మాణం అనంతరం ప్రస్తుతం దేశమంతా జై శ్రీరామ్ నినాదం మార్మోగుతుందని, భారతావనికి శ్రీరాముడు ఆదర్శనీయుడని ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక ముసల రామాలయం పార్కు వద్ద ప్రగతి భారతమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్ తమలంపూడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ యంత్ర నిర్మాణకర్త అన్నదానం చిదంబర శాస్త్రిని గరికపాటి నరసింహారావు ఘనంగా సత్కరించారు. అనంతరం బాల రాముని లీలలపై నరసింహారావు ప్రవచనం సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యను రాజధానిగా చేసుకుని దశరథుడు సుభిక్షంగా పాలన సాగించారన్నారు. అందుకే విష్ణుమూర్తి రాముని అవతారంలో దశరథుని కుమారుడిగా జన్మించాడన్నారు. ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు ఎక్కడ చూసినా జై శ్రీరామ్ అనే నినాదం అందరి నోట వినబడుతుందని, అయోధ్యలో శ్రీరా ముని మందిరం నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్క రూ ఒక యజ్ఞంలా కార్యక్రమాన్ని పూర్తి చేశార న్నారు. ప్రతి ఒక్కరూ రాముని ఆదర్శంగా తీసుకుని కుటుంబంలో కలహం వస్తే సర్దుకుపోవాలని, అలాగే బయ ట వారితో శత్రుత్వం వస్తే కృష్ణునిలా యుద్ధం చేయాలన్న నీతిని మన పురాణాల నుంచి తెలుసుకోవాలన్నారు. అనంతరం గరికపాటి నరసింహారావును ప్రగ తి భారతమ్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ఉత్పాదకం.. భవితకు మంత్రం

- 9వ తరగతి విద్యార్థులకు ఈఎండీపీ అమలు
- జిల్లాలో 20,848 మందికి ప్రయోజనం
- ఎక్స్‌పోకు సిద్ధమవుతున్న విద్యాశాఖ

రాయవరం: సాధారణంగా ఏ విద్యార్థినైనా పదో తరగతి చదివిన తర్వాత ఏమి అవుతావని అడిగితే.. డాక్టర్, ఇంజినీర్, ఐఏఎస్ అనో సమాధానాలు ఇస్తుంటారు. అలా కాకుండా విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా వారిని ఇతర రంగాల వైపు, ముఖ్యంగా ఉత్పాదక రంగాల దిశగా పయనించేలా రాష్ట్ర విద్యాశాఖ ఒక వినూత్న కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ)ను గతేడాది నుంచి అమలు చేస్తుంది. విద్యార్థుల వినూత్న ఆలోచనలకు కార్యాచరణ తోడయ్యే విధంగా రూపొందించిన కార్యక్రమం ఈ విద్యా సంవత్సరం, గత ఏడాది జూన్ నుంచి పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక ఆలోచనలు రేకెత్తించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి' కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు గతేడాది అక్టోబర్ 14 నుంచి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈఎండీపీ అమలు చేయగా, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలల పునః ప్రారంభం నుంచే కార్యాచరణలోకి తెచ్చారు. అయితే విద్యార్థులు నేర్చుకున్న పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై వారికి ఏ మేరకు అవగాహన కలిగిందో తెలుసుకునేందుకు ప్రాజెక్టుల ఎక్స్‌పోను త్వరలోనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

విజయవంతంగా అమలు

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారేందుకు ఈఎండీపీ ప్రోగ్రామ్ జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు బోధనాంశాలపై విలువైన సమాచారంతో కూడిన ఆన్‌లైన్ మాడ్యూల్స్‌ను విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందజేశారు. రీప్ బెనిఫిట్, ఉద్యమ్, అప్లటూన్ స్వచ్ఛంద సంస్థలు మాడ్యూల్స్‌ను రూపొందించాయి. ఈఎండీపీ పాఠ్యాంశాలను విద్యార్థులు కూడా ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. గతేడాది నిర్వహించిన ఈఎండీపీ ఎక్స్‌పోలో ఈ విషయం నిర్ధారణ అయ్యింది. జిల్లా స్థాయి ఎక్స్‌పోలు ప్రదర్శించిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి కూడా ఎంపిక కావడం గమనార్హం. ప్రస్తుత ఏడాది ఈఎండీపీ జిల్లా స్థాయి ఎక్స్‌పోను త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు. ఈఎండీపీ అమలు చేస్తున్న ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ప్రాజెక్టులు సమర్పించాలి. ఇప్పటి వరకూ 32 పాఠశాలల నుంచి 180 ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేశారు. ఈ సంఖ్య మరింత పెరగాలి.


తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈఎండీపీ పాఠ్యాంశాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో 222 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈఎండీపీ పాఠాలు నేర్పిస్తున్నారు. ఇందుకు గాను తొమ్మిదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు 9వ తరగతి విద్యార్థులకు ప్రతి శుక్రవారం తరగతులు నిర్వహిస్తున్నారు. ఆర్థిక అక్షరాస్యత బోధనలో భాగంగా బడ్జెట్, పొదుపు, ఖర్చు తదితర అంశాలపై చైతన్యం కలిగిస్తున్నారు. సాంకేతికత, ఇతర ఉత్పత్తులను పరిచయం చేస్తున్నారు. సమస్య ఎదురైతే పరిష్కారంపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో వివరిస్తున్నారు. 18 అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 26 సెషన్లను వారానికి రెండు పీరియడ్ల చొప్పున ఉపాధ్యాయులు బోధన పూర్తి చేస్తున్నారు.

భవిష్యత్తుకు పునాది వేసేలా..


తొమ్మిదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న ఈఎండీపీ పాఠాలు వారి భవిష్యత్తుకు చక్కని పునాదిని వేస్తాయి. ముఖ్యంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఏర్పడుతుంది. మాడ్యూల్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. భవిష్యత్తు అవకాశాలను ముందే ఊహించడం ద్వారా జీవితంలో నిలదొక్కుకునే వీలుంటుంది.

–ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

వినూత్న ఆలోచనలకు వేదిక


తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈఎండీపీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం. విద్యార్థులు వినూత్న ఆలోచనలకు ఈఎండీపీ వేదికగా నిలుస్తుంది. ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

–యనమదల నవ్య, ఈఎండీపీ జోనల్ మేనేజర్, అమలాపురం

ఎక్స్‌పో విజయవంతానికి ప్రణాళిక


ఈఎండీపీ ఎక్స్‌పోను త్వరలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన ప్రాజెక్టుల నుంచి పది ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శిస్తారు. ప్రభుత్వం రీప్ బెనిఫిట్, ఉద్యమ్, అప్లటూన్ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఈఎండీపీ కార్యక్రమం సమర్థవంతంగా అమలవుతోంది.

–జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

నీటి ఎద్దడిపై ముందస్తు కార్యాచరణ

- ఉమ్మడి జెడ్పీ సమావేశంలో మంత్రి చెల్లుబోయిన వేణు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కాకినాడ సిటీ: రానున్న వేసవిలో సాగు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అధికారులకు సూచించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జెడ్పీ సమావేశపు మందిరంలో ఆదివారం జరిగింది. అజెండాలో మొదటి అంశంగా గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్)పై సభ్యులు చర్చించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకున్న చర్యలు వివరించాలని అధికారులను కోరారు. మూడు జిల్లాల పరిధిలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను మార్చి 31 నాటికి పూర్తి స్థాయిలో నింపుతామని, బోరు బావుల్లో ముందస్తు ఫ్లషింగ్ నిర్వహిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బదులిచ్చారు. అవసరమైన ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికీ తాగునీటి సరఫరాకు పైపులైను విస్తరణ పనులు వేగవంతం చేయాలని పలువురు సభ్యులు కోరారు. గోదావరి చెంతనే ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మెట్ట, డెల్టా ప్రాంతాలు వేసవిలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాయని అన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ, జల్‌జీవన్ మిషన్ పనులను సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించాలని కోరారు.

వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో అధికారులు మాట్లాడుతూ, రబీకి అవసరమైన ఎరువులు, అపరాల సాగుకు అవసరమైన విత్తనాలకు ఎటువంటి కొరతా లేదని తెలిపారు. కాకినాడ ఎంపీ వంగా గీత, పలువురు జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ, తాళ్లరేవు, కాజులూరు మండలాలు, ఏలేరు వ్యవస్థలోని శివారు భూములకు సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కోరారు. రబీలో సాగునీటి సమస్య తలెత్తకుండా వంతుల వారీ విధానం అమలు చేస్తున్నామని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ద్వారా చేపట్టిన పనుల ప్రగతిని కూడా సభ్యులు సమీక్షించారు. విద్యా శాఖ సమీక్షలో సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని సూచించారు. మంత్రి వేణు మాట్లాడుతూ, తాను, ఎంపీ వంగా గీతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉమ్మడి జెడ్పీ నుంచే ప్రజాసేవలో ఉన్నత పదవులు అందుకున్నామని, తమలాగే ప్రస్తుత పాలక మండలి సభ్యులు కూడా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాల లబ్ధి అందరికీ అందేలా కృషి చేయాలని కోరారు. తొలుత జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లా ప్రగతి సాధన అంశాల్లో చైతన్యవంతమైన కృషి చేస్తూ, ఉమ్మడి జెడ్పీ పాలక మండలి రెండున్నరేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుందని చెప్పారు. దీనికి అన్నివిధాలా కృషి చేసిన సభ్యులకు, సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్లు ప్రవీణ్ ఆదిత్య, నూపుర్ అజయ్, ఎస్.తేజ్‌భరత్, జెడ్పీ వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మంత్రి వేణు, ఎంపీ వంగా గీత, జెడ్పీ చైర్మన్ విప్పర్తి, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

బడ్జెట్‌కు ఆమోదం

జిల్లా పరిషత్ 2023–24 సవరణ బడ్జెట్, 2024–25 అంచనా బడ్జెట్ ప్రతిపాదనలకు సభ్యులు ఆమోదం తెలిపారు. జెడ్పీ సమావేశపు మందిరంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన ఆదివారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. జెడ్పీ బడ్జెట్‌ను సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి చదివి వినిపించారు. 2023–24 సవరణ బడ్జెట్‌లో ఆదాయం రూ.883.34 కోట్లు, వ్యయం రూ.882.79 కోట్లు, మిగులు రూ.55 లక్షలుగా పేర్కొన్నారు. అలాగే, 2024–25 అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.886.95 కోట్లు, వ్యయం రూ.886.33 కోట్లు గాను, మిగులుగా రూ.62 లక్షలుగా ప్రతిపాదించారు. సవరణ, అంచనా బడ్జెట్‌లకు సభ్యులు తమ ఆమోదం తెలియజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ తదితర ఐదు విభాగాలతో పాటు జెడ్పీకి వస్తున్న ఆదాయ, వ్యయాలను అంచనా వేసి బడ్జెట్‌ను రూపొందించామని సీఈఓ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. సీనరేజ్ ఫీజు, స్టాంప్ డ్యూటీపై రూ.4 సర్‌చార్జి, అద్దెలు, తదితర మార్గాల ద్వారానే జెడ్పీకి ఆదాయం వస్తుందని చెప్పారు. ఆయా ప్రభుత్వ శాఖల అధికారులందరూ జెడ్పీకి ఆదాయం వచ్చేలా కృషి చేయాలని చైర్మన్ వేణుగోపాలరావు సూచించారు.

2024-25 బడ్జెట్‌లో ఆదాయం, వ్యయం అంచనాలు (రూ.కోట్లలో)

వ్యయం	
సీనరేజి పద్దు	700
తలసరి ఆదాయం	160
స్టాంప్ డ్యూటీ, సర్‌చార్జీ	1,200
రేవులపై ఆదాయం	100
ఇతర ఆదాయాలు	247.1
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం	492
జిల్లా నీటి యాజమాన్య సంస్థ	392.26
గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం	400
వ్యయం	
పనులు	369
మంచినీటి సరఫరా	289
ఎస్సీ సంక్షేమం	225
ఎస్టీ సంక్షేమం	89
స్త్రీ, శిశు సంక్షేమం	276
ఆగంతక ఖర్చులు	99
కాంట్రిబ్యూషన్ ఖర్చులు	45
కార్యాలయ నిర్వహణ	361

క్లుప్తంగా

తల్లిదండ్రుల చెంతకు పసిబిడ్డ



జగ్గంపేటలో బాబును తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

జగ్గంపేట: పోలీసులు, ఐసీడీఎస్ అధికారుల చొరవతో ఓ పసిబిడ్డ అయినవారి చెంతకు చేరారు. హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం.. స్థానిక నెహ్రూ కాలనీలో శనివారం ఓ చర్చి వద్ద ఏడాది బాబును ఓ తల్లి వదిలేసి వెళ్లిపోయింది. దీంతో స్థానికులు ఆ చిన్నారిని పోలీసులకు అప్పగించగా, వారు ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమకు సమాచారం అందించడంతో ఆ శాఖ సిబ్బంది వచ్చారు. ఆ బాబుకు స్థానిక సీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించారు. ఆదివారం కాకినాడ శిశు సంక్షేమ కార్యాలయానికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో స్థానికుడు కింతాడ రాజు వచ్చి ఆ బాబు తన కుమారుడేనని పోలీసులను కలిశాడు. తన భార్యకు మతిస్థిమితం లేక నెహ్రూ కాలనీలో వదిలేసిందని తెలిపాడు. చివరికి అన్ని వివరాలు తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఫా'రెస్ట్‌లోకి' పెద్ద పులి

- కొవ్వాడ వద్ద అడవిలోకి ప్రవేశించినట్లు గుర్తింపు

దేవరపల్లి: పెద్ద పులి అందరినీ హడలెత్తించింది.. రెండు వారాలపాటు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసింది.. సుమారు 14 రోజులు తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఐదు మండలాల ప్రజలు, రైతులను వణికించిన పెద్ద పులి శనివారం రాత్రి తన రూటును మార్చుకుంది. బుట్టాయగూడెం మండలం కొవ్వాడ వద్ద రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రవేశించినట్టు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. శుక్రవారం రాత్రి గోపాలపురం మండలం కరగపాడు వద్ద పంట పొలాల్లో పెంపుడు పందిని హతమార్చిన ఆ పులి అక్కడి నుంచి రిజర్వ్ ఫారెస్ట్ ద్వారా కొవ్వాడ వద్ద పొలాల్లో కట్టేసిన ఆవుపై పంజా విసిరింది. ఆవును చంపి సగం తిని విడిచిపెట్టడంతో పెద్ద పులి గోపాలపురం మండలాన్ని విడిచినట్టు అధికారులు అంచనా వేశారు. ఏలూరు, ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, మాతగమ్మమెట్ట, గోపాలపురం, కరగపాడు మీదుగా పెద్ద పులి కొవ్వాడ చేరుకున్నట్టు తెలిపారు. ఇది ఇక్కడ రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశించినట్లు చెబుతున్నారు. ఈ పులి జాడ కోసం అన్వేషణ కొనసాగుతుందని వారన్నారు.

అమలాపురం.. అభివృద్ధి సుమం

- జిల్లా కేంద్రంపై ప్రభుత్వం ప్రగతి ముద్ర
- రూ.105 కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.193 కోట్ల మేర సంక్షేమ ఫలాలు
- 'నాడు-నేడు'తో ఆస్పత్రి, పాఠశాలలకు కొత్త సొబగులు
- తాగునీటి సరఫరా సామర్థ్యం పెంపునకు రూ.20 కోట్లతో ప్రాజెక్టులు
- రూ.17 కోట్లతో 341 పనులు

అమలాపురం టౌన్: ఒకప్పుడు అవిభక్త తూర్పుగోదావరి జిల్లాలోని అనేక పట్టణాల్లో అమలాపురమూ ఒకటి. ఇప్పుడు ఏకంగా అందాల కోనసీమ జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. గడచిన ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అమలాపురం పట్టణం ప్రగతి పట్టాలపై పరుగులు పెట్టింది. వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో ఈ ప్రగతి సుసాధ్యమైంది. పట్టణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో పాటు వైఎస్సార్ సీపీ నేతృత్వంలో పని చేస్తున్న మున్సిపల్ కౌన్సిల్ కూడా గతం కంటే మెరుగైన పాలన అందిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పాటు మొత్తం 28 సంక్షేమ పథకాలతో పట్టణ ప్రజలకు ఇప్పటి వరకూ రూ.193 కోట్ల మేర లబ్ధి చేకూరింది. అలాగే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సాధారణ నిధులు, పలు రకాల గ్రాంట్ల ద్వారా మొత్తం రూ.105 కోట్లతో అభివృద్ధి సాకారమైంది. స్థానికంగా 30 వార్డులకు 15 వార్డు సచివాలయాలు ఏర్పడ్డాయి. వీటి ద్వారా 138 మంది ఉద్యోగులు కార్యదర్శుల హోదాలో, 302 మంది వలంటీర్లుగా పౌర సేవలందిస్తున్నారు.

ఇదీ అమలాపురం స్వరూపం

ఆవిర్భావం:	1848
విస్తీర్ణం:	7.02 చదరపు కిలోమీటర్లు
వార్డులు:	30
జనాభా:	53,231
ఓటర్లు:	40,469
పురుషులు:	19,835
మహిళలు:	20,634
రోడ్లు:	195 కిలోమీటర్లు
డ్రెయిన్లు:	111 కిలోమీటర్లు
వీధి దీపాలు:	4,634
వార్డు సచివాలయాలు:	15

ఇవీ ప్రగతి బాటలు

- మొత్తం రూ.17 కోట్ల మున్సిపల్ సాధారణ నిధులతో 341 పనులు చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మొత్తం రూ.12 కోట్లతో వివిధ పనులు చేశారు. ఈ నిధులతో ఎక్కువగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు జరిగాయి.
- పట్టణంలో తాగునీటి సరాఫరా వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించేందుకు రూ.20 కోట్లు విడుదలయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇప్పటికే స్థానిక గాంధీనగర్‌లో ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణం జరుగుతోంది. పట్టణంలో మరో రెండు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మించడంతో పాటు 5 వేల తాగునీటి కనెక్షన్లు ఇవ్వనున్నారు.
- మన బడి నాడు - నేడు పథకం కింద మున్సిపాలిటీ నిర్వహణలోని రెండు ఉన్నత, 9 ప్రాథమిక పాఠశాలలు, 2 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను మొత్తం రూ.9 కోట్లతో అభివృద్ధి చేశారు. కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో నేడు ఆ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి.
- వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని నాడు-నేడు పథకం ద్వారా రూ.5.50 కోట్లతో తీర్చిదిద్దారు.
- గడప గడపకూ మన ప్రభుత్వం కింద పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు విడుదలయ్యాయి. వీటిలో ఇప్పటికే రూ.2.34 కోట్లతో 38 పనులు పూర్తయ్యాయి.
- 27వ వార్డులో రూ.1.05 కోట్లతో పట్టణానికి రెండో అర్బన్ హెల్త్ సెంటర్ నూతన భవనం సమకూరింది.
- మున్సిపల్ కార్యాలయం సమీపాన రూ.3.20 కోట్లతో సోషల్, కల్చరల్ ఇన్‌స్టిట్యూషన్ భవనం పేరిట మెగా షాపింగ్ మాల్ నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన జరిగింది.
- రూ.1.80 కోట్లతో స్థానికంగా రెండు పార్కులను పూర్తి స్థాయిలో ఆధునీకరించారు.
- ఈదరపల్లి వంతెన - నల్లవంతెన మధ్య బైపాస్ రోడ్డును రూ.3.50 కోట్లతో సీసీ రోడ్డుగా తీర్చిదిద్దారు.
- పట్టణ పేదలు 932 మందికి అల్లవరం మండలం బోడసకుర్రులో టౌన్‌షిప్‌గా నిర్మించిన టిడ్కో అపార్ట్‌మెంట్స్ ఇళ్లు నిర్మించారు.
- అమలాపురానికి చెందిన 2,800 మంది పేదలకు రూరల్ మండలం తాండవపల్లి, వన్నెచింతలపూడి, అల్లవరం మండలం బోడసకుర్రులో దాదాపు 50 ఎకరాల్లో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణం, లే అవుట్లు సిద్ధమవుతున్నాయి.



అమలాపురం ప్రధాన రోడ్డులో రూపుదిద్దుకున్న డివైడర్

సంక్షేమ కాంతులు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 28 సంక్షేమ పథకాల ద్వారా పట్టణ ప్రజలకు ఇప్పటి వరకూ రూ.193 కోట్ల మేర లబ్ధి చేకూరింది. (కొన్ని పథకాలు.. లబ్ధి వివరాలు రూ.లలో..)

పథకం	లబ్ధి
వైఎస్సార్ పెన్షన్ కానుక	78,00,00,000
జగనన్న అమ్మఒడి	13,00,00,000
జగనన్న విద్యా దీవెన	12,59,00,000
జగనన్న వసతి దీవెన	6,50,00,000
వైఎస్సార్ సున్నా వడ్డీ	12,84,00,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ (430 మందికి)	1,30,00,000
వైఎస్సార్ చేయూత	22,10,00,000
వైఎస్సార్ ఆసరా	20,95,00,000

- పట్టణ సుందరీకరణకు రూ.80 లక్షలతో డివైడర్లను అభివృద్ధి చేశారు.
- డంపింగ్ యార్డ్‌లో చెత్త కొండలను కరిగించేందుకు శాస్త్రీయ పద్ధతిలో రీ సైక్లింగ్ చేసే దిశగా లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ బయో మైనింగ్ యూనిట్‌ను రూ.2.50 కోట్లతో ఏర్పాటు చేశారు. దీని ద్వారా 30 వేల టన్నుల చెత్త శుద్ధీకరణ, రీ సైకిలింగ్ చేయనున్నారు.
- స్వచ్ఛ అమలాపురం సాధనకు ప్రభుత్వం మున్సిపాలిటీకి 12 టిప్పర్లను సమకూర్చి, నిత్యం ఇంటింటా తడి, పొడి చెత్త సేకరిస్తోంది.
- ఈడబ్ల్యూఎస్ కాలనీ శివారున ఉన్న కైలాస భూమి (శ్మశానం)లో రూ.1.44 కోట్లతో పర్యావరణ హాని లేకుండా మృతదేహాలను దహనం చేసే గ్యాస్ క్రిమిటోరియం నిర్మించారు.



నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసిన మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల



అమలాపురంలో రూ.3.50 కోట్లతో నిర్మించిన ఈదరపల్లి- నల్లవంతెన బైపాస్ రోడ్డు



అమలాపురం పట్టణ పేదలకు నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయం

జిల్లా కేంద్రానికి తగినట్టుగా..



కొత్తగా ఏర్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అమలాపురం కేంద్రమైంది. ఇందుకు తగినట్టుగానే పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం. జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతున్నాం. బైపాస్ రోడ్లను విస్తరించాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఈదరపల్లి, నల్లవంతెన, ఎర్ర వంతెనలకు ప్రత్యామ్నాయంగా మూడు వంతెనలు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల పరంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు అధికంగా నిర్మించాం. తాగునీటి సరఫరా మెరుగుదలకు రూ.20 కోట్లతో ప్రాజెక్ట్ పనులు దశల వారీగా జరుగుతున్నాయి.

\- పినిపే విశ్వరూప్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం

ఇవే కదా అసలైన సేవలంటే..



జగనన్న ప్రభుత్వంలో మా కుటుంబం నాలుగు పథకాల ద్వారా లబ్ధి పొందుతోంది. మాకు ఆ పథకాల వివరాలు చెప్పి, దరఖాస్తులు పెట్టించి, మా కుటుంబానికి లబ్ధి వచ్చేలా చేసింది మా వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీరే. ఇవే కదా అసలైన ప్రభుత్వ సేవలంటే. ఇళ్ల వద్దకే వచ్చి సేవలందించడం గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వంలోనూ చూడలేదు. ఈ ప్రభుత్వంలోనే ఇంతటి మార్పులు, సులభతరమైన సేవలు చూస్తున్నాను. మా కుటుంబ సభ్యులు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, జగనన్న చేదోడు పథకాల ద్వారా లబ్ధి అందుకుంటున్నారంటే అది వార్డు సచివాలయాలు, వలంటీర్ల వల్లే.

\- కాశిపల్లి వెంకటరమణ, లబ్ధిదారు, నారాయణపేట, అమలాపురం

ప్రభుత్వం వల్లే ప్రగతి సాకారం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచే అమలాపురం మున్సిపాలిటీలో అనూహ్యమైన ప్రగతి సాకారమైంది. సంక్షేమం, అభివృద్ధి పేరిట దాదాపు రూ.300 కోట్లు వెచ్చించాం. అన్ని విధాలా పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు.

\- రెడ్డి సత్య నాగేంద్రమణి, చైర్‌పర్సన్, అమలాపురం మున్సిపాలిటీ

జగమంత ఆసరా

పారదర్శకతకు నిలువుటద్దం



మాది ఆత్రేయపురంలో కనకదుర్గ డ్వాక్రా గ్రూపు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా సంఘంలో ఒక్కో సభ్యురాలికి నాలుగు విడతల్లో రూ.1.20 లక్షల రుణ మాఫీ జరిగింది. నాలుగో విడతలో రూ.30 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. గతంలో ఎప్పుడూ డ్వాక్రా రుణమాఫీ జరిగిన సందర్భం లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేసి పారదర్శకత పాలన అంటే ఏంటో చూపించారు. మహిళలకు అండగా నిలిచారు. నా వస్త్ర వ్యాపారానికి ఈ 'ఆసరా' కొండంత అండ అయ్యింది.

\-కర్రి పద్మావతి, ఆత్రేయపురం

ఒకప్పుడు కాళ్లరిగేలా తిరిగినా పాలకుల దర్శనభాగ్యం లభించని పరిస్థితి.. పోనీ వారే ప్రజలను కలుస్తారా అంటే.. ఎక్కడ నిలదీస్తారోనన్న భయం. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాలకులు సగర్వంగా ప్రజల ముంగిటకొస్తున్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడమే అందుకు కారణం. అతివలకు అగ్రాసనం వేసిన సీఎం జగన్, పథకాల అన్నింట్లో వారిని భాగస్వాములను చేశారు. ఇందులో ప్రధానమైంది వైఎస్సార్ ఆసరా. గత టీడీపీ హయాంలో డ్వాక్రా రుణమాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్లేటు ఫిరాయించాడు. తాము అధికారంలోకి వచ్చాక డ్వాక్రా రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తామని చెప్పిన జగనన్న ఆ మాటను నిలబెట్టుకున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడత సొమ్మును ఆయా డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో వేసి పారదర్శక పాలన అంటే ఏంటో చూపించారు. ఆ ఆనందం లబ్ధిదారుల మాటల్లోనే..

\-ఆత్రేయపురం



అంతులేని ఆనందం



డ్వాక్రా సంఘాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఆసరాగా నిలిచారు. వ్యాపారాభివృద్ధికి ఆర్థిక చేదోడు అయ్యారు. లొల్లలోని గాయత్రీ డ్వాక్రా గ్రూపులో ఒక్కో సభ్యురాలికి వైఎస్సార్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో రూ.40 వేల రుణమాఫీ జరిగింది. ఎవరి ప్రమేయం, ఎటువంటి రాజకీయాలు లేకుండా వైఎస్సార్ ఆసరా సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాటలు వేసింది. అన్నింటా రాణించేలా ప్రోత్సహిస్తోంది.

\-మేడిది అనంతలక్ష్మి, లొల్ల

హైందవ సంస్కృతిని కాపాడుకోవాలి

- ఆదిశైవ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర
- పసలపూడిలో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం

రాయవరం: హైందవ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ అన్నారు. రాయవరం మండలం పసలపూడిలో సంఘం రాష్ట్ర కార్యవర్గ ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైందవ సంస్కృతీ సంప్రదాయాలకు మూల స్తంభమైన ఆలయ వ్యవస్థకు ఆదిశైవ అర్చకులు తమ వంతు కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ ఆదిశైవ అర్చక కుటుంబాలు నిత్యం పరమ శివునికి పూజలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 60 వేల ఆదిశైవ అర్చక కుటుంబాలు ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల మంది అర్చకులు ఐక్యంగా ఉండేందుకు ఆత్మీయ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గతంలో జీఓఎంఎస్ నంబరు 496ను అనుసరించి అర్చకులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కనీసం వేతనం రూ.25 వేలకు తగ్గకుండా చూడాలని, ధూపదీప నైవేద్య పథకంలో దేవాలయాల సంఖ్యను మరింత పెంచాలని, అర్చకుల స్వాధీనంలో ఉన్న ఈనాం భూముల్లో టైటిల్ స్వామి పేరు మీద, అనుభవదారుగా అర్చకుని పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు 11 డిమాండ్లతో సమావేశం తీర్మానం చేసింది. సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి విల్లూరి వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు దొంతికుర్తి కాశి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పత్రి అనిల్‌కుమార్, రాష్ట్ర కోశాధికారి మురికిపూడి కృష్ణకిశోర్ తదితరులు కూడా ప్రసంగించారు. 13 ఉమ్మడి జిల్లాల పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘు సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సత్యసీతారామశర్మ

గోకవరం యువకునికి పురస్కారం

వెంకట్ దాసరికి ఉత్తమ షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ అవార్డు



తిరుపతిలో బెస్ట్ షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ అవార్డు అందుకుంటున్న విశ్వనాథ్ వెంకట్ దాసరి

గోకవరం: గోకవరానికి చెందిన విశ్వనాథ్ వెంకట్ దాసరి నిర్మించిన 'కలయ వసంతం' షార్ట్ ఫిల్మ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ డైరెక్టర్ అవార్డు దక్కింది. తిరుపతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అతను ఈ పురస్కారం అందుకున్నారు. దృష్టి లోపాన్ని జయించిన వెంకట్ దాసరి 2012లో పారో ఆఫ్ ది కింగ్ పుస్తకం ద్వారా రచయితగా మారాడు. దీనికి విశేష పాఠకాదరణ లభించడంతో 2015లో ది విక్టోరియన్ పేరుతో రెండో పుస్తకాన్ని, 2022లో బకెట్ ఆఫ్ ది నాలెడ్జ్ పేరుతో భారతీయ ఆధ్యాత్మికతపై మూడో పుస్తకాన్ని రచించారు. అనంత రం దర్శకత్వంపై మక్కువతో హైదరాబాద్‌లోని రామానాయుడు ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ డైరెక్టర్, స్క్రీన్ రైటింగ్‌లో డిప్లమో కోర్సు పూర్తి చేశారు. అభివృద్ధి, మూఢ నమ్మకాల పేరుతో చెట్లను నరుకుతుండటంతో సామాజిక బాధ్యతగా కలయ వసంతం అనే షార్ట్ ఫిల్మ్ తీశారు. దీనికి ఉత్తమ డైరెక్టర్‌గా ఇంటర్నేషన్ ఫి ల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం తిరుపతిలో జరిగిన అవార్డు ఫంక్షన్‌లో మూర్తిస్వామి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. విశ్వనాథ్ వెంకట్ దాసరి మాట్లాడుతూ తనకు సహకరించిన నటీనటులు సోనీ, శ్రీరామ్, రామానాయుడు ఫిల్మ్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఏలూరి, స్టాఫ్ అశోక్‌శంకర్, శ్రీగృహ, సోనీసింగ్‌లతో పాటు తల్లిదండ్రులు సత్య, రాధాకృష్ణ, సోదరి సాయికి కృతజ్ఞతలు తెలిపారు.

పరుగో పరుగు..



పోటీల్లో రంకెలేస్తూ పరుగెడుతున్న ఎడ్లు

- ఆసక్తికరంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు
- సీనియర్స్‌లో కోనసీమ, జూనియర్స్‌లో కృష్ణా జిల్లా విజయం

సామర్లకోట: రంకెలేస్తూ.. సైసై అంటూ జోడెడ్ల బండి కదిలింది.. నువ్వా నేనా అనేట్లు పరుగు అందుకుంది.. ఎడ్ల పరుగు పందెం పోటీలు సర్వత్రా ఆసక్తి రేకెత్తించింది.. సామర్లకోటలోని ఉండూరు ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఆదివారం జరిగాయి. చంద్రమౌళి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ పోటీలను నిర్వాహకులు, న్యాయ నిర్ణేత కొండపల్లి శ్రీనివాసు, మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి ప్రారంభించారు. అంతరించిపోతున్న ఎడ్ల సంపదను కాపాడాలనే తరచూ ఇటువంటి పోటీలు జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్స్ విభాగంలో 9 జతల ఎడ్లు, జూనియర్స్ విభాగంలో 30 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోటీలు మధ్యాహ్నం రెండు గంటలకు ముగిశాయి. ఈ పోటీలను తిలకించడానికి అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు తరలివచ్చారు. సీనియర్స్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు ప్రథమ, కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన వల్లూరి సత్యేంద్రకుమార్ ఎడ్లు ద్వితీయ, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. ప్రథమ విజేతకు రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 20 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలు, మెమెంటోలను ముఖ్య అతిథులు మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, పారిశ్రామిక వేత్త చందలాడ బాబ్జి అందజేశారు. జూనియర్స్ విభాగంలో కృష్ణా జిల్లా జమిగోల్లేపల్లికి చెందిన నలజాల నరసింహారావు ఎడ్లకు ప్రథమ బహుమతిగా రూ. 25 వేలు, మండపేటకు చెందిన వేగుళ్ల నారయ్యచౌదరి ఎడ్లకు ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, వెల్దుర్తికి చెందిన మొగిలి ఏసుబాబు ఎడ్లకు తృతీయ బహుమతిగా రూ.15 వేలు, సామర్లకోట మండలం కాపవరానికి చెందిన కుంచం మనోజ్ ఎడ్లకు నాల్గో స్థానంలో రూ.10 వేలు, సామర్లకోట మండలం కొప్పవరానికి చెందిన బండారు శ్రీను ఎడ్లకు ఐదో స్థానం రాగా రూ.8 వేలను ముఖ్య అతిథులు గోలి వెంకట అప్పారావుచౌదరి, గోకిన శివబాబు అందజేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా యనమల కృష్ణ, సీహెచ్ రామకృష్ణ, కొండపల్లి కృష్ణమూర్తి, పీతాని వీరబాబు, కొట్ని శ్రీను వ్యవహరించారు.



సీనియర్స్ విభాగంలో ప్రథమ విజేతకు బహుమతి ఇస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ పద్మనాభం తదితరులు